

ఉరుకుందలో 'శ్రావణ' సంబరం

కౌతాళం మండలం ఉరుకుందలో ఈరన్న స్వామి ఉత్సవాలు ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

8లో



.. రాజకీయ కుంపటి

మధ్యాహ్న భోజన నిర్వహణలో రాజకీయ జోక్యం పెచ్చుమీరుతోంది. మండగిరి పరిధిలోని అర్‌జీ నగర్‌లో వంట నిర్వహణ కోసం బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

8లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.14
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:98.414
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,71,353
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,74,675

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి. కబర్ది



కర్నూలు(లీగల్): కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి.కబర్దిని నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈమె నెల్లూరు జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్నారు. పదోన్నతి కల్పించి కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు గత బుధవారం పదవీ విరమణ చేయడం తెలిసిందే.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజల ఫిర్యాదులను స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

మాజీ సైనికులు వివరాలు నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న సైనిక సంక్షేమ శాఖ అధికారిణి రత్నరూత్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మాజీ సైనికులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిణి ఎస్ఆర్ రత్నరూత్ కోరారు. శనివారం స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వివరాలు ఉంటే ప్రభుత్వం నుంచి వచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు వీలవుతుందన్నారు. గుర్తింపు కార్డులతో పాటు ప్రభుత్వం అందించే భూముల విషయంలోనూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పెన్షన్ పేమెంట్ ఆర్డర్‌లో నామినీ వివరాలను పొందుపరచాలన్నారు. సమావేశంలో కార్యాలయ పర్యవేక్షకురాలు మహేంద్రమ్మ, మాజీ సైనికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు గుర్తింపు కార్డులు అందించారు.

సీఐలకు స్థానచలనం

కర్నూలు: పోలీసు శాఖలో అధికారుల బదిలీల కొనసాగుతున్నాయి. కర్నూలు రేంజ్ పరిధిలో 52 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ముందు పొరుగు జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారికి ఈ బదిలీల్లో జిల్లాలో పోస్టింగులు దక్కాయి. అలాగే వీఆర్‌లో ఉన్న ముగ్గురిని స్టేషన్లకు నియమించగా స్టేషన్లలో ఉన్న తొమ్మిది మందిని వీఆర్‌కు పంపుతూ బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆపద ప్రబంధన్ పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): సుభాష్‌చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్-2025 అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు, సంస్థలు అందించిన అమూల్యమైన సహకారం ,నిస్వార్థ సేవలను గుర్తించి వారిని గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కార్‌లను ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన వారు www. awards.gov.in అనే వెబ్‌సైట్ ద్వారాఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవార్డుకు ఎంపికైన సంస్థలకు రూ.51లక్షలు,వ్యక్తులకు అయితే ఒక్కొక్కరికీ రూ .5లక్షలచొప్పున పారితోషికంఇవ్వనున్నట్లు తెలిపారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముగిసింది. రెండో తేదీ రాత్రి పొద్దుపోయే వరకు పింఛన్లు పంపిణీ చేశారు. కర్నూలు జిల్లాలో 2,43,337 పింఛన్‌లకు రూ.103.54 కోట్లు విడుదలు కాగా.. 2,41,969 పింఛన్‌లకు రూ.102.97 కోట్లు పంపిణీ చేశారు. వివిధ కారణాలతో జిల్లాలో 1,368 మంది పింఛన్లు పొందలేదు. నంద్యాల జిల్లాలో 2,19,963 పింఛన్లు ఉండగా రూ.92.88 కోట్లు విడుదల కాగా.. 2,41,969 పింఛన్లకు రూ.92.34 కోట్లు పంపిణీ చేశారు.

పేద విద్యార్థులకు బాసటగా..



దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన రజాక్‌బాషా, సంజామలకు చెందిన తాహిర్‌బాషా మిత్రులు. ఇద్దరూ పేదరికంలో పుట్టారు. చదువే తమకు గొప్ప ఆస్తి అని నమ్ముకున్నారు. బి. తాండ్రపాడులోని డైట్ కాలేజీలో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని 2012లో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారు. దొర్నిపాడు మండంలోని ఉర్దూ స్కూల్లో తాహిర్‌బాషా, ఎంపీపీ స్పెషల్ స్కూల్లో రజాక్ బాషా ఉపాధ్యాయవృత్తిని కొనసాగిస్తున్నారు. తాము పడ్డ కష్టాలు విద్యార్థులు పడకూడదని ప్రతి ఏటా రూ.15వేల వరకు వెచ్చించి విద్యాసామగ్రిని అందజేస్తున్నారు.

ఒకరికొకరు అండగా..



ఈ చిత్రంలోని ఇద్దరు స్నేహితులు కర్నూలు జిల్లా అటవీ శాఖ అధికారి ఐఎఫ్ఎస్ శ్యామల, తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ ఐఎఫ్ఎస్ ప్రవీణ. అనంతపురం జిల్లాకు చెందిన శ్యామల కర్నూలు డీఎఫ్ఓగా విధులు నిర్వహిస్తున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన ప్రవీణ తెలంగాణ రాష్ట్రం ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్నారు. వీరు ఇద్దరు 2006లో రేంజ్ ఆఫీసర్లుగా డెహ్రాడూన్‌కు ట్రైనింగ్‌కు వెళ్లారు. అక్కడ మొదలైన పరిచయం స్నేహితులను చేసింది. వీరి స్నేహం ఇప్పటికీ అమరికలు, అనర్థాలకు ఆస్కారం లేకుండా కొనసాగుతోంది. ఎలాంటి ఇబ్బంది వచ్చినా, కష్టం కలిగినా ముందుగా చర్చించుకుంటూ ముందుకు సాగుతున్నారు.

సేవలకు చేదోడుగా..



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారిలో ఒకరు కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి, మరొకరు వైఎస్ఆర్ జిల్లా కడపకు చెందిన బాలాజీరావు. కడపలోని ఆర్ట్స్ కాలేజీలో వీరిద్దరూ డిగ్రీ చదివారు. నాడు ఏర్పడిన స్నేహంగా నేటికీ చెక్కు చెదరకుండా కొనసాగుతోంది. తాము ఎంత దూరంలో ఉన్నప్పటికీ నెలలో కనీసం రెండు సార్లు కలసి మాట్లాడుకుంటామని, బాలాజీ రావు బాసట స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు చేస్తుంటారని అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం కూడా అందిస్తున్నట్లు చెప్పారు.

స్నేహితులంతా ఒకటిగా..



ఈ చిత్రంలోని మహిళలు ఉపాధ్యాయులు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన వారు. సుజాత, మనోరంజని, లిల్లి శిరోమణిలు చిన్ననాటి నుంచి స్నేహితులు. వీరికి కరుణ, అన్నపూర్ణ, అరుణలు డిగ్రీ స్థాయి నుండి స్నేహితులుగా తోడయ్యారు. వీరంతా గతంలో ఓ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లారు. ఏళ్లు గడుస్తున్నా తమ స్నేహం మాత్రం అలానే కొనసాగుతోందని, తామంతా ఒకటిగా ఉంటున్నట్లు వీరు తెలిపారు.

స్నేహ బంధం.. సేవా సుగంధం



- కష్టసుఖాల్లో తోడుగా ఉంటున్న మిత్రులు
- కల్మషమెరుగని నేస్తాలు... జీవన ఉన్నతికి సోపానాలు
- నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: బాధలు చుట్టుముట్టినప్పుడు.. భావోద్వేగాలు పెల్లుబికినప్పుడు.. మనసు కుదుట పడాలంటే 'నేనున్నాన'ని భరోసానిచ్చేదే స్నేహం. జీవితం గజి'బిజీ'గా సాగిపోతూ.. యాంత్రికంగా మారిపోతూ.. కాలంతో పోటీపడి పరుగెడుతున్న మనిషికి ఇది సాంత్వన ఇస్తోంది. రక్తసంబంధీకుల మధ్య మాటలు కరువై పోతున్న ప్రస్తుత రోజుల్లో.. డబ్బుకే విలువనిచ్చే కాలంలో.. స్నేహబంధం సేవా సుగంధాలను వెదజల్లుతోంది. పాఠశాలలోనో.. కాలేజీ చదివే రోజుల్లోనో.. ఉద్యోగం చేస్తున్న ప్రదేశంలోనో అభిప్రాయాలు కలవొచ్చు.. అభిరుచులు ఒక్కటిగా ఉండవచ్చు.. ఎప్పుడైనా అది స్నేహంగా మొగ్గ తొడగవచ్చు. ఫేస్‌బుక్‌లోనో, ట్విట్టర్‌లోనో, వాట్సాప్‌లోనూ చిన్ననాటి మిత్రులు కలవచ్చు. ఎప్పుడో జరిగిన విషయాలను గుర్తు చేస్తూ.. కల్మషం లేకుండా మాట్లాడుతూ మనసులో ఉన్న దిగులును పోగొట్టవచ్చు. ప్రియ నేస్తాలు సమస్యల చిక్కుముళ్లను ఇట్టే విప్పేస్తారు. స్నేహితులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ జీవితానికో పరమార్థం కల్పిస్తారు. స్నేహ సౌధానికి పరస్పర విశ్వాసమే బలమైన పునాది. కాలమహిమ ప్రభావంతో మనిషి జీవితంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ తరతరాలుగా స్నేహ బంధం గొప్పగా నిలబడుతోంది. ఆదర్శాన్ని చాటుతోంది. నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మిత్రుల మనసులో మాట..



ఎమ్మిగనూరు పట్టణంలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు చూపుతున్న విద్యార్థులు

ప్రకృతితో స్నేహం



ప్రతి మనిషికి కనీసం ఒక స్నేహితుడు అయినా ఉండాలి. కష్ట సుఖాలను పంచుకోవడానికి, బాధలో భరోసా ఇవ్వడానికి మిత్రుడు ఎప్పటికీ ఉండాలి. కొందరు చిన్నతనం నుంచే బెస్ట్ ఫ్రెండ్స్‌గా ఉంటారు... మరికొందరు వృత్తి పరంగా బెస్ట్ ఫ్రెండ్స్‌గా ఏర్పడతారు. నేను కూడా ప్రకృతితో చిన్న నాటి నుంచే స్నేహం చేశా. అందమైన ప్రదేశాలు, చారిత్రక కట్టడాలను చూడడానికి చాలా ఆసక్తి కనబరిచేదాన్ని. నా విద్యాభ్యాసం అంతా ప్రకృతి ఒడిలోనే సాగింది. చదువుకునే రోజుల్లో, అలాగే ఉద్యోగంలో ఒత్తిడి ఎదురైతే ప్రకృతి ఒడిలోనే సేదతీరేదాన్ని.

– రాజకుమారి గణియా, నంద్యాల జిల్లా కలెక్టర్

మిత్రుని తోడ్పాటుతోనే ఈ స్థాయిలో..



నేను ఈ స్థాయిలోనే ఉన్నానంటే నా తల్లిదండ్రులతో పాటు నా మిత్రుడు తోడ్పాటుతోనే. మాది ఎమ్మిగనూర్ పట్టణం. మూడో తరగతి నుంచి డిగ్రీ వరకు నా మిత్రుడు బండ శ్రీనివాసులుతో కలిసి చదువుకున్నాను. చిన్నప్పుడు గురువులు చెప్పే లెక్కలు అర్థమయ్యేవి కావు. మిత్రుడు శ్రీనివాసులు లెక్కలు అర్థం అయ్యే విధంగా చేప్పేవాడు. డిగ్రీ వరకు కలిసి చదువుకున్నాం. నా మిత్రుడు కోసిగి మండలంలో ఎంపీహెచ్ఈగా పని చేస్తున్నాడు.

– సోమశేఖర్, ఎంఈఓ, బేతంచెర్ల మండలం

సామాజిక సేవ నచ్చేది



తిరుపతిలోని పద్మావతి ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాల నుంచే ఎం నాగరాణితో మంచి స్నేహం ఏర్పడింది. విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో చురుగ్గా పాల్గొనే నాగరాణి భావాలతో నా భావాలు కూడా ఏకం కావడంతో మా మధ్య స్నేహ బంధం ఇంకా బలపడింది. పద్మావతి మహిళా కళాశాలలో ఇద్దరం డిగ్రీలో బీకాం తీసుకున్నాం. నాగరాణి చేస్తున్న సామాజిక సేవ నాకు బాగా నచ్చేది. విద్యార్థి దశ నుంచి ప్రారంభమైన మా స్నేహం నేటికీ అలాగే కొనసాగుతోంది. ప్రస్తుతం నాగరాణి తిరుపతిలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

– కే తులసీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

సామరస్యం కలిపింది



నేను ఆళ్లగడ్డ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుకునే సమయంలో మోహన్, ముజీబ్‌తో స్నేహం ఏర్పడింది. మా స్నేహాన్ని చూసి చుట్టుపక్కల వాళ్లు అమర్, అక్బర్, ఆంటోని అని పిలిచేవాళ్లు. ఇప్పటికీ మా స్నేహం కొనసాగుతోంది. అమర్ బ్యాంక్ మేనేజర్‌గా, ముజీబ్ ప్రైవేట్ టీచర్‌గా, నేను డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నా. మేం ముగ్గరం వేర్వేరు మతాలకు చెందిన వాళ్లం. అయినప్పటికీ మాలో ఎలాంటి భేదభావం లేదు. సామరస్యమే మమ్మల్ని కలిపింది. మా స్నేహం ఎల్లకాలం నిలిచే ఉంటుంది.

–అనిల్, సంజామల డిప్యూటీ తహసీల్దార్

మానసికంగా ధైర్యం ఇచ్చారు



ప్రస్తుతం కడపలోని రిమ్స్ హాస్పిటల్‌లో ఆర్థోపెడిక్ హెచ్‌వోడీగా ఉన్న డాక్టర్ రామ్‌మనోహర్‌కు నాకు ఆప్త మిత్రుడు. ఆయన నాకు 1998లో తిరుపతిలో ఎంబీబీఎస్ చదివే సమయంలో పరిచయమయ్యాడు. అప్పటి నుంచి ప్రతి క్షణం ఆయన నాతో ఉండేవారు. నాకు మానసికంగా ఎంతో ధైర్యం ఇచ్చేవాడు. నాకు ఏ సమస్య వచ్చినా మొదట ఆయనకే చెప్పుకునే వాన్ని. ఇప్పటికీ చెప్పుకుంటాను. నాకు మంచి సలహాలు, సూచనలు ఇస్తారు. నా ఎదుగుదలకు అన్ని విషయాల్లో ప్రోత్సహిస్తాడు. ఆయన భార్య డాక్టర్ రేఖారావు సైతం నా క్లాస్‌మేట్. ఆమెను అక్కా అని, డాక్టర్ రామమోహన్‌రావును బావ అని పిలుచుకుంటాను. మా అనుబంధం ఎంతో అన్యోన్యమైనది.

– డాక్టర్ ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో, కర్నూలు

బాధను కూడా పంచుకోవాలి



స్నేహితుడు అంటే సంతోషమే కాదు బాధను కూడా పంచుకోవాలి. 1997-98లో వైఎంకే పాఠశాలలో చదువుకున్న స్నేహితులమంతా వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేశాం. కరోనా సమయంలో మరణించిన మిత్రుడు రమేష్ కుటుంబానికి రూ.50,000 అందించి ఆదుకున్నాం. మరో స్నేహితుడు మల్లికార్జున కుటుంబానికి రూ.1,00,000 అందించారు. ఇటీవల సహచరుడు రామలింగ కిడ్నీ సమస్యలతో బాధపడుతుంటే రూ. 2,00,000 సాయం చేశాం. మిత్రులు మహేందర్‌రెడ్డి, బద్రినాథ్, నరేంద్రకుమార్, కిరణకుమార్ సహాయ సహకారాలతో ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం చాలాసంతోషంగా ఉంది.

– రమణ, ఫొటోగ్రాఫర్, ఆదోని

దేశభక్తి ఉట్టిపడేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించేందుకు ఏర్పా ట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ, రాష్ట్ర, జిల్లాల సంస్కృతి, సంప్రదాయాలను అనుసరిస్తూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకుందామన్నారు.

- విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, 30-45 నిమిషాల సమయం అందుకోసం కేటాయించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.
- స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలను సన్మానించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.
- పరేడ్ గ్రౌండ్‌లో జెండావిష్కరణ, మార్చ్‌ఫాస్టుకు ఎలాంటి లోటు పాట్లు తలెత్తకూడదన్నారు.
- ప్రొటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను వేడుకలకు ఆహ్వానించాలని డీఆర్వో కె.మధుసూధన్‌రావుకు సూచించారు.
- పరేడ్ గ్రౌండ్‌లో శానిటేషన్, మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు.
- ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు విషయంలో అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు.
- అదేరోజు సాయంత్రం ఎట్ హోం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సమీక్షలో డీఆర్వో కె.మధుసూధన్‌రావు, డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అండగా ఉంటాం..అధైర్యపడొద్దు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఆలూరు ఎమ్మెల్యే పరామర్శ



చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి

ఆస్పరి: అధైర్య పడవద్దని, అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి భరోసా ఇచ్చారు. మండలంలోని బిల్లేకల్లులో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడిలో గాయపడి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆస్పరిలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వారిపై దాడులు చేస్తూ చేతులు, కాళ్లు నరికేస్తున్నా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఖండించడం లేదన్నారు. బిల్లేకల్లులో దౌర్జన్యంగా టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేసి గాయపరిచారన్నారు. ఆస్పరి సీఐ హనుమంతప్పపైనే దాడి చేశారంటే ఎంత దౌర్జన్యపరులో అర్థమవుతోందన్నారు. బిల్లేకల్లులో టీడీపీ నాయకులు కొంత మంది నాటు సారా బట్టీల పెట్టి గ్రామాలకు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న ఆలూరు నియోజకవర్గంలో భయాందోళనలు సృష్టించడానికే టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవర్చకుండా సీఎం, డిప్యూటీ సీఎం మాటలకే పరిమితమైయ్యారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

'మనీ' ట్రాన్స్‌ఫర్లు

పోలీసు బదిలీల్లో జోరుగా ముడుపుల వ్యవహారం

- ఫైరవీలతో మార్గం సుగమం
- 'లెక్క' ఇచ్చిన వారికే జాబితాలో చోటు
- మూడవ జాబితాపై మరికొందరి ఆశలు



కర్నూలు: పోలీసు బదిలీల పర్వంలో కొందరు ప్రజాప్రతినిధులు దోపిడీకి తెర లేపారు. ఆదాయం ఉన్న స్టేషన్లకు ఒక రేటు, మండల స్థాయి స్టేషన్లకు మరో రేటు ఖరారు చేశారు. పోలీసు అధికారులు కూడా 'జీతం' కన్నా 'గీతం'పై ఆశతో పోటీపడి పోస్టింగులు కొనుక్కుంటున్నారు. అడిగినంత ముట్టజెప్పి సిఫారసు లేఖ అందుకుంటున్నారు. ఇప్పటివరకు రెండు విడతలుగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. స్టేషన్ పోస్టింగ్ దక్కని కొందరు ఇన్‌స్పెక్టర్లు చివరి ప్రయత్నంగా మూడో జాబితాపై ఆశలు పెట్టుకున్నారు. బదిలీల కోసం పోలీసు అధికారుల పైరవీలు తార స్థాయికి చేరాయి. అధికార పార్టీ నేతలు ముడుపులకు ప్రాధాన్యతనిస్తూ లేఖలు ఇస్తుండటంతో కొన్ని స్టేషన్ల నియామకాలు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు శాఖలో విడతల వారీగా అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఆ బదిలీలపై అధికారులతో పాటు సొంత పార్టీ వర్గాల్లోనూ గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆ స్టేషన్ల పోస్టింగులకు పెరిగిన పోటీ

కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలోని సీఐ, ఎస్ఐ పోస్టులకు డిమాండ్ నెలకొంది. కొన్ని స్టేషన్లలో పోలీసులకు రాబడి అధికంగా ఉంటోంది. దీంతో అక్కడి పోస్టింగుల కోసం అధికారులు పోటీ పడుతున్నారు. ఎలాగైనా సీటు దక్కించుకునేందుకు కొందరు సీఐలు, ఎస్ఐలు అధికార పార్టీ నేతలను కలసి పనిని చక్కబెట్టుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లా పోలీసు శాఖలో తొమ్మిది పోలీస్ సర్కిళ్లు, 13 మంది సీఐలు ఎస్‌హెచ్ఓలుగా ఉండే స్టేషన్లు, 25 మంది ఎస్ఐలు ఎస్‌హెచ్ఓలుగా ఉండే స్టేషన్లు ఉన్నాయి. అన్ని విభాగాల్లో కలిపి 68 మంది ఎస్ఐలు, 42 మంది సీఐలు పోలీసు శాఖలో ఉన్నారు. ఇప్పటివరకు దాదాపు 32 మందికి బదిలీల్లో స్థానచలనం కలిగింది. మూడో జాబితాలో మరికొన్ని సర్కిళ్లకు ఇన్‌స్పెక్టర్లను నియమించాల్సి ఉన్నందున ఆశావహులు చివరి ప్రయత్నంగా ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆ కుర్చీని ఇప్పించండి...

ఓ సీఐ ముడుపులతో పాటు సామాజిక సమీకరణను కలుపుకుని కర్నూలులోని ఓ ప్రాధాన్యత గల స్టేషన్ అడుగుతున్నారు. ఎప్పుడూ లేనంతగా నగర పరిధిలోని ఆరు పోలీస్ స్టేషన్లకు అత్యధిక డిమాండ్ ఉంది. రెండు విడతల బదిలీల్లో కర్నూలు రెండవ పట్టణం, కర్నూలు రూరల్ తాలూకా పోలీస్ స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్ల నియామకం పూర్తయ్యింది. మిగిలిన వాటికి ఒక్కొక్క స్టేషన్‌కు సగటున ఐదుగురు ఆశావహులు ప్రయత్నాల్లో ఉన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన సర్కిల్ పోస్టింగ్ కోసం ఓ అధికారి చివరి ప్రయత్నంగా తన పలుకుబడినంతా ఉపయోగిస్తున్నారు. జిల్లా పోలీసు శాఖలో ఆయనను 'ఇసుక రాజా'గా పిలుచుకుంటారు. ఆ స్టేషన్‌కు రావడానికి చాలామంది పోటీ పడుతున్నా ఆయనకు మాట ఇచ్చానని 'నేత' చెబుతున్నట్లు చర్చ జరుగుతోంది.

వసూళ్లపై శాఖలో బహిరంగంగానే చర్చలు

పోలీసు అధికారుల పోస్టింగులకు కొందరు ప్రజాప్రతినిధులు భారీగా ముడుపులు వసూలు చేశారు. ఆ ప్రభావం రాబోవు కాలంలో పోలీసింగ్‌పై పడుతుందేమోనని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. భారీగా చెల్లించి పోస్టింగ్ పొందినవారు తిరిగి ఆ మొత్తాన్ని రాబట్టుకునే క్రమంలో అడ్డగోలు చర్యలకు పాల్పడతారేమోనని ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నట్లు పోలీసు శాఖలో జోరుగా చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

సూక్ష్మ సేద్యానికి కేంద్ర సాయం

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి సంబంధించి సూక్ష్మ సేద్య సదుపాయాన్ని కల్పిస్తోంది. సూక్ష్మ సేద్యం అమలుకు కేంద్రం ఏకంగా రూ.73.06 కోట్లు భరిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సూక్ష్మ సేద్యం కింద 15 వేల హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యం కల్పించేలా జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చింది. ఐదు ఎకరాల్లోపు రైతులకు 90 శాతం, 5 ఎకరాలు పైబడి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్య సదుపాయం కల్పిస్తారు. సూక్ష్మ సేద్యానికి అయ్యే మొత్తం ఖర్చు 134.89 కోట్లు ఉండగా.. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.73.06 కోట్లు,రాష్ట్ర ప్రభుత్వం రూ.48.70 కోట్లు భరిస్తాయి. రైతుల వాటా రూ.13.13 కోట్లు. సూక్ష్మ సేద్యానికి రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో(ఆర్‌బీకేలు) రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. ఇతర వివరాలకు 08518–279724, 7995078264, 6303613097 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

చేపల పెంపకంపై మూడు నెలల శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): చేపల పెంపకం, మార్కెటింగ్ తదితరాలపై నిరుద్యోగ యువతకు కర్నూలులోని దేశీయ మత్స్య శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 30లోగా పూర్తి చేసిన దరఖాస్తులను బంగారు పేటలోని తమ కార్యాలయంలో అందచేయాలని సూచించారు. ఈ నెల 31న ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ఉరుకుందలో ‘శ్రావణ’ సంబరం

- ఈనెల 5 నుంచి ప్రారంభం
- నెల రోజుల పాటు వేడుకల నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కౌతాళం: శ్రావణ మాస ఉత్సవాలకు ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి క్షేత్రం ముస్తాబవుతోంది. ఈనెల 5 నుంచి వేడుకలు ప్రారంభమై సెప్టెంబర్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వేడుకల్లో ప్రతి సోమవారం, గురువారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సారి ఐదు సోమవారాలు, నాలుగు గురువారాలు వచ్చాయి. మూడో సోమవారం ఒక్క రోజే మూడు లక్షలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని అంచానా. చివరి సోమవారం స్వామి వారి పల్లకోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి.

మహిమాన్విత క్షేత్రం..

ఉరుకుంద ఈరన్న స్వామిని నిష్టతో కొలుస్తే శుభం జరుగుతుందని భక్తుల నమ్మకం ఉంది. మండల కేంద్రమైన కౌశాళానికి ఈ క్షేత్రం 6కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ స్వామి వారు నిత్యం పూజలు అందుకుంటున్నారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు ఇక్కడికి వస్తుంటారు. శ్రావణ మాసోత్సవాల్లో భక్తుల సంఖ్య లక్షల్లో ఉంటుంది. స్వామి సిద్ధ పురుషుడని, వీరభద్ర అంశంతో భూలోకానికి వచ్చిన దైవదూతగా పెద్దలు చెబుతారు. దాదాపు రెండువేల సంవత్సరాల క్రితం ఉరుకుంద గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని మానవజాతిని ఉద్ధరించారనే కథలు ప్రచారంలో ఉన్నాయి. స్వామి నిరాకారుడిగా ఇక్కడ పూజలందుకుంటున్నారు. ఆలయంలో పెద్దరావి చెట్టు ఉండగా.. దాని చుట్టూ కట్టను నిర్మించారు. ప్రస్తుతం భక్తులు కట్టకే పూజలు చేస్తున్నారు. స్వామి ఇప్పటికీ రాత్రివేళల్లో సర్ప రూపంలో, సాధువు రూపంలో సంచరిస్తుంటాడని భక్తులు నమ్మకం. శ్రావణ మాస ఉత్సవాలు ముగిసే వరకు ఈ ప్రాంత ప్రజలు మద్యపానానికి, మాంసహారానికి దూరంగా ఉంటారు.



ఈరన్నస్వామి మూలవిరాట్



ఈరన్నస్వామి ఆలయ ఐదు రాజగోపురాలు

ప్రతి ఇంట్లోనూ ఆయన నామమే..

స్వామి కొలువైన గ్రామంతో పాటు పరిసర పల్లెల్లో ఏ ఇంటికి వెళ్లినా స్వామి నామమే వినిపిస్తుంది. ప్రతి ఇంట్లోనూ ఈరన్న, ఈరమ్మ, వీరేష్, వీరన్న ఇలా పేర్లు వినిపిస్తాయి. తమ పిల్లలకు స్వామి పేర్లు పెట్టడం వల్ల శుభం జరుగుతుందని భక్తులు భావిస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

శ్రావణ మాస ఉత్సవాల్లో ఉరుకుంద క్షేత్రానికి ఆదోని, ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు నడపనున్నారు. అలాగే కర్ణాటకలోని బళ్లారి, శిరుగుప్ప, రాయచూరు, సింధనూరు నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతారు. ఉరుకుందలో స్వామిని దర్శించుకున్న భక్తులు ఆలయం వెనుక ఉన్న ఆంజినేయ స్వామి, నాగుల స్వామి, బసవన్న కట్టను దర్శించుకోవడం ఆనవాయితీ. ఉరుకుంద నుంచి 5 కిలోమీటర్ల దూరంలో పురాతనమైన బుడుములదొడ్డి అంజనేయ స్వామి దేవస్థానం ఉంది. అలాగే 15 కిలోమీటర్ల దూరంలో మేళిగనూరు వద్ద రామలింగేశ్వర స్వామి ఆలయం, 40 కిలోమీటర్లు దూరంలో మంత్రాలయం మఠం ఉంది.

భక్తులకు వసతులు ఇవీ..

- ఆలయం వద్ద నిత్యాన్నదానం కార్యక్రమం జరుగుతుంది.
- ఆలయం సమీపంలోనే మాధవరం మేజర్ కాలువ ప్రవహిస్తోంది. ఈసారి తుంగభద్ర డ్యాంలో పుష్కలంగా నీరు ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
- తాగునీటి కోసం 15ట్యాంకర్లను సిద్ధం చేశారు.
- దేవాలయం వద్ద నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసి మినరల్ వాటర్‌ను సరఫరా చేయనున్నారు.
- భక్తుల సహకారంతో నిర్మించిన 202 గదులు అందుబాటులో ఉన్నాయి.

ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం



శ్రావణ మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. రూ. 4.60 కోట్లతో మహా ప్రాకారం ఇప్పటికే పూర్తయ్యింది. రూ. 9.80కోట్లతో నాలుగు గోపురాల రూపుదిద్దుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. రూ. 1.28 కోట్లతో బండ పరుపు పనులు చేపడుతున్నాం. ఉత్సవాల్లో భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– హెచ్‌జీ వెంకటేశ్, ఆలయ డిప్యూటీ కమిషనర్

బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోండి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తమ వద్ద ఉన్న 2జీ, 3జీ సిమ్‌లను 4జీ సిమ్‌గా ఉచితంగా అప్‌గ్రేడ్ చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి. రమేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు పరిధిలో దా దాపు 400 సెల్‌టవర్ల ద్వారా 4జీ సేవలను దశల వారీగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఇప్పటికీ తమ మొబైల్ సేవలను 2జీ,4జీ సిమ్ తో మాత్రమే ఉపయోగిస్తున్న వారికి, వారి ప్రాంతాల్లో 4జీ సేవలను ప్రారంభించినప్పుడు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వారు తమ సిమ్‌ను అప్‌గ్రేడ్ చేసిన తర్వాత మొ బైల్ సేవలను నిరంతరాయంగాఆస్వాదించవచ్చన్నారు. 4జీ అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 2జీ, 3జీ సేవలు కూడా కొనసాగుతాయన్నారు. 54040 నంబర్‌కు SIM అనే సందేశాన్ని ఎస్ఎంఎస్ ద్వారా పంపడం ద్వారా కస్టమర్లు తమ సిమ్ రకాన్ని (2జీ, 3జీ, 4జీ) సులభంగా కనుగొనవచ్చన్నారు. ఈ ఉచిత 4జీ సిమ్‌లు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లలో, బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు/రిటైలర్లు/ఏజెంట్ల ద్వారా అందుబాటులో ఉంటాయన్నారు.



రమేష్, బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా మేనేజర్

న్యాయమూర్తుల వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి

కర్నూలు (లీగల్): జిల్లాలోని న్యాయమూర్తులందరికీ శనివారం జిల్లా కోర్టు హాలులో ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి, ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో తీర్పుల అమలు తీరుపై న్యాయమూర్తులకు అవగాహన కల్పించారు. విశ్రాంత న్యాయమూర్తులు, రిసోర్స్ పర్సన్స్ అయిన జి.వి.కృష్ణయ్య, కొట్టు శైలజ ఎగ్జిక్యూటివ్ పిటిషన్స్ (ఈపీ) అమలులో చట్టపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈపీల అమలు విషయంలో పలువురు న్యాయమూర్తులు వారి అనుభవాలను చర్చించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు పి.వాసు, మురళీకృష్ణ, సబ్ జడ్జిలు మల్లీశ్వరి, దివాకర్, జూనియర్ సివిల్ జడ్జిలు టి.జ్యోత్స్న దేవి, ఎం.సరోజనమ్మ, జి.వందన, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల నుంచి కర్నూలుకు ఏరువాక కేంద్రం

కర్నూలు(అగ్రికల్చర్): గత ఏడాది నంద్యాల జిల్లాకు మార్చిన ఏరువాక కేంద్రం(డాట్ సెంటరు) తిరిగి కర్నూలుకు వస్తోంది. ఈ మేరకు ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల విభజన సందర్భంగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు కేంద్రంగా పనిచేస్తున్న ఏరువాక కేంద్రాన్ని నంద్యాలకు తరలించారు. దీంతో జిల్లా రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందడం కష్టమైంది. బనవాసిలో కృషి విజ్ఞాన కేంద్రం ఉన్నప్పటికీ కర్నూలు, కల్లూరు, వెల్దుర్తి, క్రిష్ణగిరి, కోడుమూరు, గూడూరు, సీ.బెళగల్, ఓర్వకల్, దేవనకొండ, మద్దికెర, తుగ్గలి పత్తికొండ తదితర మండలాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడింది. రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో నంద్యాలలో ఉన్న ఏరువాక కేంద్రాన్ని కర్నూలుకు తరలించేందుకు యూనివర్సిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏరువాక కేంద్రానికి కోఆర్డినేటర్‌గా క్రాప్ ప్రొడక్షన్ ప్రిన్స్‌పల్ సైంటిస్ట్ సుజాతమ్మ నియమితులయ్యారు. కలెక్టరేట్‌లోనే ఏరువాక కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందుకోసం అనువైన గదులను కేటాయించాని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ సుజాతమ్మ శనివారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కలిశారు.

మధ్యాహ్న భోజనంలో రాజకీయ కుంపటి

- వంట నిర్వహణకు గ్రూపుల మధ్య ఘర్షణ



ఘర్షణ పడుతున్న ఇరువర్గాల వ్యక్తులు





చికిత్స పొందుతున్న లక్ష్మీబాయి నాయక్, నాగేష్

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణలో రాజకీయ జోక్యం పెచ్చుమీరుతోంది. ఇటీవల గణేకల్లు, హనవాళు, ఇస్వీ, పెద్దహరివాణం గ్రామాల్లో వంట నిర్వహణ కోసం ఏజెన్సీ గ్రూపులు ఘర్షణ పడే స్థాయికి చేరుకున్నాయి. ఈ సంఘటనలను మరువక ముందే ఆదోని నియోజక వర్గం మండగిరి గ్రామ పంచాయితీ పరిధిలోని అర్‌జీ నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట నిర్వహణ కోసం శనివారం బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇద్దరికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. మొదట ఇందిరా ద్వాక్రా గ్రూపు సభ్యులు భోజనాన్ని వండుతుండగా.. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అంజలి డ్వాక్రా గ్రూపుకు చెందిన వారు వంటను వండేందుకు అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. శనివారం ఆ లెటర్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులకు అందించడంతో వంట నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. దీంతో కోపోద్రిక్తులైన ఇందిరా గ్రూపుకు చెందిన ఉలిగప్ప, పార్వతి, ఉసేని, దస్తగిరి బీజేపీ కార్యకర్త నాగేష్, అంజలి గ్రూపునకు చెందిన లక్ష్మీబాయి నాయక్, మహేష్ నాయక్‌తో ఘర్షణకు దిగారు. ఇరువురు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో నాగేష్, లక్ష్మీబాయి నాయక్ గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం వీరిని ఆదోని ప్రాంతీయ ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ వైద్యం అందించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కూటమి ప్రభుత్వం చిచ్చు పెడుతుందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

రైతులు పండ్లతోటల సాగులో రాణించాలి

- కప్పట్రాళ్ల రైతులతో వర్చువల్‌గా మాట్లాడిన ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ

దేవనకొండ: రైతులు పండ్లతోటల సాగులో రాణించాలని కప్పట్రాళ్ల గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన రైతులతో వర్చువల్‌గా మాట్లాడారు. త్వరలో గ్రామానికి వస్తున్నట్లు, ప్రతి ఒక్కరూ పండ్ల మొక్కలను సాగు చేయాలని, లాభాలను ఆర్జించాలని సూచించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హాజరై ప్రసంగించారు. గత కప్పట్రాళ్లకి ప్రస్తుత కప్పట్రాళ్లకి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. గత జిల్లా ఎస్పీగా పనిచేసిన ఆకె రవికృష్ణ చొరవతో గ్రామం ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. సేవ్ ట్రీస్ వారు గ్రామ రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. ప్రోగ్రామ్ మేనేజర్ బి.నారాయణ మాట్లాడుతూ.. గ్రామంలో 22 మంది రైతులకు మామిడి, చీనీ, జామ, కొబ్బరి, మహాగని, అంజూర, ఎర్రచందనం తదితర 12 వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో దేవనకొండ సీఐ శ్రీనివాసులు, ప్రోగ్రామం మేనేజర్ బి.నారాయణ, నవయువత అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు, గ్రామ రైతులు చింతమాను రవికుమార్, ఈడిగ వెంకటరమణ, పాల్గొన్నారు.



రైతులకు పండ్ల మొక్కలను అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, దేవనకొండ సీఐ శ్రీనివాసులు

గండ్లేరుకు చేరుకున్న కృష్ణా జలాలు

- తెలుగు గంగ 17వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వకు గండి
- నీటి ప్రవాహంలో కొట్టుకు పోయిన గేదెలు

రుద్రవరం: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి అధికారులు విడుదల చేసిన నీరు శనివారం తెల్లవారు జామున రుద్రవరం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న గండ్లేరు జలాశయానికి చేరుకుంది. ఒక్క సారిగా ప్రధాన కాల్వకు మూడు వేల క్యూసెక్యుల నీరు విడుదల చేయడంతో కాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రధాన కాల్వతో పాటు ఉప ప్రధాన కాల్వలోనూ నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో శ్రీరంగాపురం వద్ద 17వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వకు గండి పడి నీరంతా మొక్కజొన్న, వరి పైర్లను ముంచెత్తింది. విషయం తెలుసుకున్న లస్కర్ల వెంటనే తూము షెట్టరును దించేశారు. లేదంటే పంటలు నీట మునిగిపోయేవి. అలాగే శ్రీరంగాపురం గ్రామానికి చెందిన శివమ్మ గేదెలను మేపుకునే క్రమంలో వాటిని తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపైకి తోలుకెళ్లింది. కట్టకు పక్కనే గ్రాసం తింటూ ప్రమాదవశాత్తు జారి నాలుగు గేదెలు ప్రధాన కాల్వలో ఉధృతంగా పారుతున్న నీటిలో పడ్డాయి. ఆ ప్రవాహ ఉధృతికి శ్రీరంగాపురం నుంచి పెద్దకంబలూరు వరకు దాదాపు 7 కి.మీ మేర ఆ గేదెలు నీటిలో కొట్టుకు పోయాయి. ఆ మహిళ తన గేదెలు కొట్టుకు పోతున్నాయని లబోదిబో మంటూ తెలుగుగంగ సిబ్బందిని, స్థానికులను కాపాడమని కోరింది. స్పందించిన వారు పెద్దకంబలూరు వంతెన వద్ద ర్యాంప్ ఉండటంతో అక్కడ గేదెలను రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఇప్పటికే 3 వేల క్యూసెక్యుల నీటిని విడుదల చేశారని, సాయంత్రానికి మరో 2వేల క్యూసెక్యుల వెలుగోడు నుంచి విడుదల చేయనున్నటు అధికారులు తెలిపారు.



అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



పెద్దకంబలూరు వద్ద ప్రధాన కాల్వలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్న గేదెలు

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు కలెక్టరేట్‌లో ఓ మహిళ ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. మెయిన్ గేటు దగ్గర ఉన్న లైటింగ్ దిమ్మెకు ఆమె తన చున్నీతో ఉరి వేసుకునేందుకు ప్రయత్నించింది. అయితే అక్కడున్న సిబ్బంది, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. త్రీటౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి సూచన మేరకు పోలీసులు ఆమె రక్షించి అవుట్ పోస్టుకు తరలించి వివరాలు తెలుసుకున్నారు. తన పేరు మెహరున్నీసాబేగం అని ఒకసారి, ప్రియా అని మరోసారి చెబుతోందని పోలీసులు తెలిపారు. తన పోషణను కొడుకు, కోడలు చూసుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, తన ఇంటి ఓనరుకు రౌడీలతో సంబంధం ఉందని చెప్పిందన్నారు. కాగా ఈమె సోమవారం కూడా అదే ప్రదేశంలో ఆత్మహత్యకు ప్రయత్నించింది. అప్పుడు కూడా అక్కడ ఉండే సిబ్బంది కాపాడారు. కాగా, ఆమె మానసిక పరిస్థితి బాగాలేదని, తలకు బలమైన దెబ్బతగిలిందని, ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పి చికిత్సఅందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు త్రీటౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి చెప్పారు.



కలెక్టరేట్ ఎదుట లైటింగ్ దిమ్మెకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నిస్తున్న మహిళ